సెప్టెంబరు 17, 2023, సోమవారం
EVENING DIGITAL EDITION
Bammera Pothana
..first rural news portal in telangana
# పాలకుర్తి ఎక్స్‌ప్రెస్ న్యూస్
PALAKURTHI EXPRESS NEWS
సాయంకాల ముచ్చట్లు

# విగ్రహాలు సరే... అనుగ్రహం దక్కేనా...?

## నియోజకవర్గం వ్యాప్తంగా విగ్రహాలు అందించిన ఎర్రబెల్లి.. గెలుపు కోసం తప్పని పాట్లు



**తొర్రూరు:** పాలకుర్తి నియోజకవర్గం లో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ప్రజలు మార్పు దిక్కుగా అడుగులేస్తున్న తరుణంలో ప్రజలను ఆకట్టుకునేందుకు స్థానిక మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పడరాని పాట్లు పడుతున్నాడని నియోజకవర్గ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల వేళ వినాయక చవితి రావడంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గణపయ్య విగ్రహాలను అందించి ప్రజల అనుగ్రహం పొందాలని మంత్రి ఆరాటపడుతున్నాడు. దీంతో ప్రజలకు నయా పైసా ఖర్చు లేకుండా వినాయక చవితి పూర్తి కానుంది. నియోజకవర్గ వ్యాప్తంగా మంత్రి ఎర్రబెల్లి బల్క్ బుకింగ్ చేయడంతో విగ్రహాల తయారీదారులకు భలే గిరాకీ ఏర్పడింది. కరోనా ప్రభావంతో గడిచిన రెండు సంవత్సరాలుగా నామమాత్రంగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన భక్తులు, యువకులు ఈ సంవత్సరం మాత్రం ఎర్రబెల్లి ఫ్రీ విగ్రహాల ఆఫర్ తో రెట్టింపు స్థాయిలో వినాయక చవితి ఉత్సవాలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుం టున్నారు. దీనికితోడు మండపాల ఏర్పాటుకు కూడా ఆర్థికసాయం చేస్తానని ఓట్ల కోసం యువకులను బుట్టలో వేసుకునే పనిలో పడ్డాడు. కాంగ్రెస్ నుంచి వస్తున్న పోటీని తట్టుకోవడానికి దయాకర్ రావు ప్రతి గ్రామంలో ఉత్సవాల నిర్వహణకు సాయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

> *సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావు ఎన్నడూ గణేష్ విగ్రహాల పంపిణీ జోలికి వెళ్లలేదు. ఈసారి ఆయన కూడా ఉచితంగా విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.*

### వందల సంఖ్యలో ఆర్డర్లు.....

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ దక్కించుకున్న మంత్రి ఎర్రబెల్లి ఇప్పటికే ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ పేరిట ఉచిత ఉద్యోగ శిక్షణ, ఉచిత స్టడీ మెటీరియల్ అందజేత, కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలకు చీరలు అందించడం, ఉపాధి కూలీలకు లంచ్ బాక్సులు అందించడం వంటి కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అందివస్తున్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుం టున్నాడు. వినా యక విగ్రహాలు ఏర్పాటులో యువకు లు ఉత్సహంగా ఉంటారు కాబట్టి వారికి ఉచితంగా విగ్రహాలు ఇచ్చి వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. ఇప్పటికే వందల సంఖ్యలో విగ్రహాలు ఆయా గ్రామాల్లో ప్రతిష్టించబ డ్డాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 1500కు పైగా విగ్రహాలు ఇచ్చినట్లు సమాచారం.

### ఇదే అదునుగా..

ఓటర్ల వద్దకు, నియోజకవర్గంలో ని మారుమూల ప్రాంతాలకు వెళ్లాలంటే గణేష్ చతుర్థి ఒక ఆయుధమని ముందుగా గుర్తించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్ని గ్రామాలకు విగ్రహాలు అందించారు. ఎర్రబెల్లి బల్కుగా ఆర్డర్లు ఇవ్వడంతో విగ్రహాలకు డిమాండ్ పెరిగి కొరత ఏర్పడింది. ఇదే అదునుగా విగ్రహాల తయారీదా-రులు కూడా వాటి రేట్లను భారీగా పెంచేశారు. గత సంవత్సరం రూ.ఐదు వేలు ఉన్న విగ్రహం ధర ప్రస్తుతం రూ.పది వేలు చెపుతున్నట్లు భక్తులు అంటున్నారు. విగ్రహాలు ఉచితంగా ఇస్తుండడంతో యువకులు కూడా పెద్దవాటి కోసం నేతల వద్ద పట్టుపడుతున్నారు. ఎదుటి వారి కన్నా మనం పెద్ద విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తుండడంతో నేతలు ఇదెక్కడి పంచాయితీరా బాబూ అంటూ గొణుక్కుంటున్నారు. తయారీదారులు మాత్రం మంచి భేరం మించిన దొరకదని సంబరపడిపోతున్నారు.

### ఎన్నికల వేళ.. గణపయ్య ప్రతిమలకు పెరిగిన డిమాండ్

*బిజెపి, కాంగ్రెస్ పార్టీలలోని మరికొంత మంది ఆశావహులు సైతం ఆయా గ్రామాల్లోని కార్యకర్తలకు విగ్రహాలను అందజేస్తున్నారు. విగ్రహంతో పాటు మండపం ఏర్పాటుకు కూడా అన్ని ఖర్చులు పెట్టుకుంటామని చెపుతూనే సదరు మండపం వద్ద తమ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు మండపం వద్ద జరిగే కార్యక్రమాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని షరతులు పెడుతున్నట్లు యువకులు అంటున్నారు. ఇక నవరాత్రులలో జరిగే అన్నదాన కార్యక్రమాలు కూడా తమ చేతుల మీదుగా జరపాలని కోరుతున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తమ బల ప్రదర్శనకు మండపాలను వేదికగా చేసుకోవడానికి ప్రయత్నిస్తుండడంతో ఈ సారి ప్రతి వీధిలో వినాయకుడి మండ మండపాల ఏర్పాటుకు పోటీ ఏర్పడింది. అలాగే మండపాల డెకరేషన్‌కు, సెట్టింగ్‌లకు అయ్యే ఖర్చులకు ఆర్థికసాయం చేస్తామంటూ ఓట్ల కోసం యువకులను బుట్టలో వేసుకునే పనిలో పడ్డారు. ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గంలో సుమారు 1,500 విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేసినట్లు సమాచారం. అందు లో 8 అడుగుల నుంచి 20 అడుగుల వరకు ఎత్తు ఉన్న విగ్రహాలే ఉండటం గమనార్హం. వాటి ఖర్చు రూ. 2కోట్ల వరకు ఉంటుందని ఓ అంచనా. వినాయక విగ్రహాల పంపిణీ తో ఎర్రబెల్లి గెలుపు అవకాశాలు ఏ విధంగా మెరుగుపడతాయో వేచి చూడాల్సిందే.*




## మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ



**రాయపర్తి:** రాయపర్తి మండల కేంద్రంలో సోమవారం స్థానిక జడ్పీ హై స్కూల్ ఉపాధ్యాయులు రావుల భాస్కర్ రావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రావుల అనిల్ కుమార్, సునీల్ సతీష్ ల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలు చెరువులో నిమజ్జనం చెయ్యడం వల్ల నీటి కాలుష్యం అవుతుందన్నారు. మట్టి వినాయక విగ్రహల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించడం తమ వంతు భాద్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆకుల నరేందర్ రావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిజెపిలోకి చేరిక....



**కొడకండ్ల:** కొడకండ్ల మండలంలోని మైదం చెరువు తండ గ్రామపంచాయితికి చెందిన కాంగ్రెస్ పార్టీ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిజెపి మండల అధ్యక్షుడు పులిగిల్ల ఉపేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు.ధరావత్ పరమేష్, ధరావత్ అజయ్, ధరావత్ చందులాల్, బానోత్ శివాజీ, జాటోత్ రాం దన్, కొర్ర బిక్య లకు రామ్మోహన్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ గారు తీసుకొస్తున్న సంక్షేమ పథకాలు, విధానాలు నచ్చి పార్టీలో అనేకమంది చేరుతున్నారని, ఈ తెలంగాణ రాష్ట్రంలో కుటుంబ పాలన, నియంతృత పాలన, అవి నీతి పాలన అంతం చేయాలంటే బిజెపి వలన సాధ్యమవుతుందనీ అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని కార్యకర్తలు అందరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా నాయకులు గూగుల్ వాసు నాయక్, మండల ప్రధాన కార్యదర్శి నానుబల వెంకన్న ,గుగూలోతు యాకూబ్ నాయక్ , మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు సాయి,సుధాకర్ నాయక్, వేల్పుల అయిలయ్య పాల్గొన్నారు.

## ఎర్రం రెడ్డి పై ఝాన్సీ రెడ్డి వర్గీయుల ఆగ్రహం

### ఎర్రబెల్లికి కోవర్ట్‌గా మారాడంటూ నినాదాలు





**తొర్రూరు:** పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నేత ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డిపై టీపీసీసీ నాయకురాలు ఝాన్సీరెడ్డి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయభేరి సభా వేదికగా కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంల ప్రచారాన్ని ప్రారంభించేందుకు తమిళనాడు సీఎల్పీ నేత సెల్వ పెరంతాంగై సోమవారం తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి నుంచి టికెట్ ఆశిస్తున్న టీపీసీసీ సభ్యురాలు ఝాన్సీరెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు అమ్మాపురం గ్రామానికి వచ్చిన మరో నేత ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి కూడా అక్కడకు రావడంతో ఝాన్సీరెడ్డి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రబెల్లి కోవర్ట్ తిరుపతి రెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఝాన్సీ రెడ్డి వర్గీయులు పెద్ద సంఖ్యలో గుమిగూడడంతో చేసేదేమీ లేక ఎర్రం రెడ్డి అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు.

## అంగన్వాడి ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలి



**పెద్దవంగర:** అంగన్వాడి ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని అంగన్వాడి టీచర్స్, వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు స్వరూప అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమ న్యాయపరమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినాయకుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడారు. అంగన్వాడీ ఉద్యోగులకు ఎంతోకాలంగా పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పదవి విరమణ పొందే ఉద్యోగులకు గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యాన్ని తెలంగాణలో కూడా అమలుచేయాలన్నారు. రెగ్యులరేషన్, కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతలాంటి విషయాలను పట్టించుకోవడం లేదన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా అంగన్వాడీ టీచర్లకు టీఏ, డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం పెంచుకోవడం శోషణీయం అన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రేణుక, మంజుల, మమత, యాకలక్ష్మీ, సరళ, ఝాన్సీ, నీలవేణి, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆరు భరోసాలు పథకాలు ఆచరణీయం కాదు

### బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తీగల దయాకర్ గౌడ్



**దేవరుప్పుల:** కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన భరోసా పథకాలు ఆచరణీయం కావని బి ఆర్ ఎస్ మండల అధ్యక్షలు తీగల దయాకర్ అన్నారు.సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్న కాంగ్రెస్ అమలు చేసిన పథకాలు అన్ని తెలంగాణను ఆదర్శంగా తీసుకొని కాపీ చేయడం తప్ప కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదు, తెలంగాణ సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో పెట్టకపోయినా రైతు బీమా రైతు బంధు పథకాలు పేద ప్రజలకు అందించాలని భావంతో ఈ పథకాలను అమలుచేశారు.లి అదేవిధంగా మిషన్ భగీరథను దేశమే ఆదర్శంగా తీసుకొని అన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం జరుగుతుంది.. తెలంగాణలో అమలు చేసే పథకాలను జాతి స్థాయిలో అమలు చేస్తున్నారని ఈ ఘనత తెలంగాణ సీఎం కెసిఆర్ కు దక్కుతుందని.. లితెలంగాణ కాంగ్రెస్ పార్టీలో భరోసా ఇచ్చే నాయకుడు లేడు కాబట్టి జాతీయస్థాయి నాయకులను తీసుకువచ్చి ఐదారు హామీలు ఇస్తే తెలంగాణలో జరిగేది ఏమీ లేదన్నారు. సమావేశంలో బస్వా మల్లేశ్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ కారుపోతుల బిక్షపతి,బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చింత రవి, బిఆర్ఎస్ మండలం నాయకులు ఆలకుంట్ల యాదగిరి, మండల సోషల్ మీడియా అధ్యక్షులు దాసగాని భరత్,చింత పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 17, 2023, సోమవారం
EVENING DIGITAL EDITION
Bammera Pothana
..first rural news portal in telangana
# పాలకుర్తి ఎక్స్‌ప్రెస్ న్యూస్
PALAKURTHI EXPRESS NEWS
సాయంకాల ముచ్చట్లు



## 60 మందికి కంటి అద్దాల పంపిణీ

**కొడకండ్ల:** మండల కేంద్రానికి చెందిన 60 మంది దృష్టిలోపం ఉన్నవారికి దామెర రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుమారులైన దామెర రమేష్, దామెర రవీందర్లు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఇటీవల మండల కేంద్రంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 60 మందికి కంటి అద్దాలు అవసరమని డాక్టర్లు గుర్తించారు. దాతలైన రమేష్, రవీందర్లు వెంటనే స్పందించి తమ తల్లి జ్ఞాపకార్థం వారందరికీ అవసరమైన కంటి అద్దాలను తమ సొంత ఖర్చులతో అందిస్తామని చెప్పి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు పేరం రాము, కార్యదర్శి దొర్ణం ప్రభాకర్, కోశాధికారి గాజుల రాములు, దామెర సోమయ్యలు పాల్గొన్నారు.

# ఆరు స్కీములతో అధికారంలోకి వస్తాం


### తమిళనాడు సీఎల్పీ నేత సెల్వ పెరుంతగై



**తొర్రూరు:** తెలంగాణలో ఆరు గ్యారెంటీ స్కీములతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని తమిళనాడు సీఎల్పీ నేత సెల్వ పెరుంతగై స్పష్టం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీముల కార్డులను కాంగ్రెస్ నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన తమిళనాడు సీఎల్పీ నేత సెల్వ పెరుంతగై గ్యారెంటీ స్కీముల కార్డులను స్థానికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని చెప్పామని..ఆ మాట నిలబెట్టుకున్నామన్నారు. ఇప్పుడు తెలంగాణకు ఇచ్చే గ్యారంటీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజు నుంచే అమల్లోకి తెస్తామన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చే హామీలు అమలు చేయదని ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోదీ అన్నారని, కానీ.. మంత్రివర్గం ప్రమాణ స్వీకారం రోజే అమల్లోకి తెచ్చామని తెలిపారు. తెలంగాణలో కూడా ఇచ్చిన హామీలన్నీ మంత్రివర్గం కొలువుదీరిన రోజు నుంచే అమల్లోకి తెస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహాత్మాగాంధీ అధ్యక్షుడిగా ఎన్నికై 2024 నాటికి వందేళ్లు పూర్తి కావస్తుందని, ఆయనకు నివాళిగా 2024లో బీజేపీని అధికారం నుంచి దించేద్దామన్నారు. తెలంగాణ నుంచి నూతనోత్తేజంతో, స్పష్టమైన సందేశంతో వెళదామని, రానున్న అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణలో చరిత్ర సృష్టించేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని, రైతుల కోసం వరంగల్, యువత కోసం హైదరాబాద్, వృద్ధుల కోసం ఖమ్మంలో డిక్లరేషన్లు చేసిందని గుర్తుచేసారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీములతో పార్టీపై ప్రజల్లో అచంచల విశ్వాసం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ హామ్య నాయక్, రాపాక సత్యనారాయణ, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు సుంచు సంతోష్, గిరగాని కుమారస్వామి, సురేష్ నాయక్, పెద్ది కృష్ణమూర్తి, ముద్దసాని సురేష్, నాయకులు మొగుళ్ల అశోక్ గౌడ్, కందాడి అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారంటీలు లేని గ్యారెంటీ పథకాలను నమ్మొద్దు

**పెద్దవంగర:** తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ, వారంటీలు లేని గ్యారెంటీలను ఇస్తున్న ఉచిత హామీలను ప్రజలు నమ్మరని మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఈదురు ఐలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పాలకుర్తి దేవస్థానం చైర్మన్ వెనుకదాసుల రాంచంద్రయ్య శర్మతో పాటు ముఖ్యనాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐలయ్య మాట్లాడారు. నిన్న కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయాబేరి సభలో ప్రకటించిన గ్యారెంటీ ఉచిత హామీలను తెలంగాణ ప్రజలు నమ్మరని, అధికారం కోసం కాంగ్రెస్ పగటికలలు కంటుందని ఏద్దేవా చేశారు. వారంటీ లేని గ్యారెంటీ పథకాలను కర్ణాటక రాష్ట్రంలో అమలు చేసి కర్ణాటక రాష్ట్రనీ ఆగం చేసింది మీ కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కాపీ కొట్టమే కాకుండా, మీరు పరిపాలిస్తున్న హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, చతీస్గఢ్ రాష్ట్రలలో ఈ హామీలను ఎందుకు అమలు చేయరని త్రీవంగా ఖండించారు. కాంగ్రెస్, బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల 600 నుండి 800 ఇస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక అధిక పెన్షన్లు ఇస్తున్నట్లు గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 24గంటల కరెంట్,సాగు నీరు,ఇంటి, ఇంటికి త్రాగు నీరు ఇస్తుంటే,కాంగ్రెస్ పార్టీ పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ 2లక్షలను, తెలంగాణ ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య.

5లక్షల కు పెంచి పేదల జీవితాలలో వెలుగులు నిపిందని అన్నారు. రైతులకు రైతుబంధు, రైతు భీమా, కళ్యాణలక్ష్మి, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, సంపండ వర్గాల అభివృద్దే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందనీ అన్నారు. ఎవరు ఎన్ని చెప్పిన ఎన్ని ఉచిత హామీలు ఇచ్చిన ప్రజలు నమ్మరని, తెలంగాణ ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారని ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం హాట్రిక్ సాధించడం ఖాయమని జోష్యం చెప్పారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును నాలుగో సారి అత్యధిక మెజారిటీతో పాలకుర్తి ప్రజలు గెలిపిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఫ్ఏ సీఎస్ వైస్ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్, మండల పార్టీ ఉపాధ్యక్షులు బానోత్ వెంకన్న, కనుకుంట్ల వెంకన్న, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ సంజయ్,మండల నాయకులు శ్రీరామ్ సుదీర్,మండల అధికార ప్రతినిధి బానోత్ సోమన్న, మోత్య తండా సర్పంచ్ ధరవత్ భీమా,గ్రామ పార్టీ అధ్యక్షులు కొండపల్లి విజయపాల్ రెడ్డి, బోనగిరి లింగమూర్తి, పాలకేంద్రం చైర్మన్ రాసాల సమ్మయ్య, భూక్యా పంతులు తదితరులు పాల్గొన్నారు.

## స్కాముల కాంగ్రెస్‌కు అధికారమిస్తే
# స్కీములన్ని ఎత్తేస్తారు

**తొర్రూరు:** స్కాముల కాంగ్రెస్ కు అధికారమిస్తే స్కీములన్ని ఎత్తేస్తారని జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ దుయ్యబట్టారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఆర్ బీఎస్ మండల కో ఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి లతో కలిసి శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ అర్ధ శతాబ్దపు పాలనంతా.. మోసం, వంచన, ద్రోహం, దాఖలమయం అని అభివర్ణించారు. కపట కథలు, కంత్రీ గోత్రాలు బాగా తెలిసిన తెలివైన గడ్డ తెలంగాణ అని వ్యాఖ్యానించారు. కల్లబొల్లి గ్యారెంటీలు రాష్ట్రంలో చెల్లవని పేర్కొన్నారు. రాబందుల రాజ్యమొస్తే రైతు బంధు రద్దవుతుందని తెలిపారు. కాలకేయుల కాలం వస్తే కరెంట్ కోతలు, కటిక చీకట్లు వస్తాయని చెప్పారు. మూడు రంగుల ఊసరవెల్లిని నమ్మితే మూడు గంటల కరెంట్ గతేనని ఎద్దేవా చేశారు. ఉచిత విద్యుత్ ఊడగొడతారని వివరించారు. దగాకోరుల పాలన వస్తే.. ధరణి రక్షణ ఎగిరిపోతుందని.. బకాసురులు గద్దెనెక్కితే రైతు బీమా.. ధీమా గల్లంతవ్వడం గ్యారెంటీ అని వెల్లడించారు. సమర్థత లేని వారికి



ఓటేస్తే.. సకల రంగాల్లో సంక్షోభమేనని తెలిపారు. ఢిల్లీ కీలుబొమ్మలు కుర్చీ ఎక్కితే ఆత్మగౌరవాన్ని అంగట్లో తాకట్టు పెడతారని పేర్కొన్నారు. దొంగల చేతికి తాళాలు ఇస్తే.. సంపదనంతా స్వాహా చేస్తారని.. భస్మాసుర హస్తాన్ని నెత్తిన పెట్టుకుంటే బూడిద మిగలడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ స్కీములు బూటకమని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మరో మారు బీఆర్ఎస్ కు అధికారం ఇవ్వాలని, పాలకుర్తిలో మంత్రి దయన్నను గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు దొంగరి శంకర్, అంకూస్, రాయిశెట్టి వెంకన్న, ఎన్నమనేని శ్రీనివాసరావు, హపావత్ సురేష్, లకావత్ యాకూబ్, వల్లపు యాకయ్య, ఎర్రం రాజు, చిట్టి మల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి నియోజకవర్గ చౌరస్తాలో
# ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మహా ధర్నా

**రిజర్వేషన్ల దోపిడీదారులకు కొమ్ముకాస్తున్న బీజేపి**

**ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు తీసుకురాకపోతే కేంద్రం మీద యుద్ధమే...**


**మాదిగలను నమ్మించి మోసం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ఆటలు సాగవు..**

**మాదిగల ఓట్లు BRS నాయకులు అడుగద్దు...**

**ఎంఎస్పి జనగామ జిల్లా ఇంచార్జ్ మడిపల్లి శ్యామ్ మాదిగ**

**పాలకుర్తి, ఎక్స్ ప్రెస్ న్యూస్:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించే ప్రక్రియను జాప్యం చేయడం ద్వారా రిజర్వేషన్లను గత డెబ్బై ఐదు ఏండ్లుగా ఏక పక్షంగా దోచుకుంటున్న దోపిడీదారులకు బిజెపి కొమ్ముకాస్తుందని ధ్వజమెత్తారు. ఈ రోజు నుండి ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం పెట్టాలని డిమాండ్ చేస్తూ పాలకుర్తి నియోజకవర్గ చౌరస్తాలో MSP ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాలో పాల్గొన్న ఎంఎస్పి జనగామ జిల్లా ఇంచార్జ్ మడిపల్లి.శ్యామ్ మాదిగ మాట్లాడుతూ " ముప్పై ఏళ్ళుగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన బిజేపీ ప్రస్తుతం సంపూర్ణ మెజారిటీతో కేంద్రంలో అధికారంలో ఉండి కుడా ఎందుకు పార్లమెంట్ లో బిల్లు పెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు నెలల క్రితం ప్రధానమంత్రి వరంగల్ లో స్వయంగా హామీ ఇచ్చిన నేటికీ కార్యరూపం దాల్చకపోవడం బాధాకరమని అన్నారు. ప్రధానమంత్రి ఇచ్చిన మాటకే విలువలేకపోతే ఈ దేశాన్ని పాలించే నైతిక అర్హత బీజేపీకి లేదని అన్నారు. అయిదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు హైదరాబాద్ లో ఉన్న అమిత్ షా ఎస్సీ వర్గీకరణ మీద మాట్లాడకుండా వెళ్లిపోవడం మాదిగల హృదయాను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణను నిర్లక్ష్యం చేయడం జరిగితే బిజేపీ మీద మాదిగలు రాజకీయ తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. CWCలో ఎస్సీ వర్గీకరణ మీద తీర్మానం చేయకుండా కాంగ్రెస్ మరొకసారి మాదిగల పట్ల వ్యతిరేకతను చాటుకుందని అన్నారు. కేవలం మాదిగల ఓట్ల కోసం ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని చేర్చరే తప్ప కాంగ్రెస్ నిజమైన చిత్తశుద్ధి లేదని అన్నారు. మాదిగల ఓట్ల కోసం చేసే కపట రాజకీయాలు ఇకపై సాగవు అని అన్నారు. పార్లమెంట్లో మహిళ, బిసి రిజర్వేషన్ బిల్లుల మీద మాట్లాడాలని ఎంపీల చేత మాట్లాడిస్తున్న కేసీఆర్ ఎస్సీ వర్గీకరణను విస్మరించి మాదిగలకు ద్రోహం చేశాడని అన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన BRS నాయకులు ఓట్ల కోసం తమ ఇళ్ళలకు రావద్దని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 20న డిల్లీలో మహాధర్నా జరుగుతుందని రేపటి నుండి 22 వరకు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు బుంజూరు.విజయ్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామరపు.శ్రీనివాస్ మాదిగ, MRPS జనగామ జిల్లా అధ్యక్షులు పైస.రాజశేఖర్ మాదిగ, ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎడవల్లి.సోమశేఖర్ మాదిగ, ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు చెరుపల్లి.యాదగిరి స్వామి మాదిగ, పాలకుర్తి మండల ఇంచార్జ్ జెర్రిపోతుల.సుధాకర్ మాదిగ, దేవరుప్పుల మండల ఇంచార్జ్ సందేన.రవీందర్ మాదిగ, పాలకుర్తి మాజీ మండల అధ్యక్షులు జలగం.నరేష్ మాదిగ, దేవరపుల మండల కో ఇన్చార్జ్ రడపాక.ఆడాం మాదిగ, దేవరపుల సీనియర్ నాయకులు పడమటింటి.నరసింహా, కొంగరి.రాములు, సురేష్ మహజన తదితరులు పాల్గొన్నారు.

## డబ్బింగ్ పూర్తి చేసిన లాల్ సలాం..



జైలర్ తో మంచి హిట్టును సొంతం చేసుకున్నారు కథానాయకుడు రజనీ కాంత్. ఇప్పుడాయన నుంచి రానున్న మరో తాజా చిత్రం 'లాల్ సలాం'. ఆయన కీలక పాత్రలో నటించిన ఈ సినిమాని తన కూతురు ఐశ్వర్య తెరకెక్కించారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. విష్ణు విశాల్, విక్రాంత్ కథానాయకులు. ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణాంతర పనుల్లో ఉంది. ఇందులో తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ ను రజనీ తాజాగా పూర్తి చేశారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు స్టూడియోలో రజనీ డబ్బింగ్ చెబుతున్న వీడియోను అభిమానులతో పంచుకుంది. క్రికెట్ నేపథ్యంగా సాగే ఓ ఆసక్తికర కథాంశంతో రూపొందిన యాక్షన్ చిత్రమిది. ఇందులో మొయిద్దీన్ భాయ్ అనే శక్తిమంతమైన పాత్రలో రజనీకాంత్ సందడి చేయనున్నారు. త్వరలో విడుదల తేదీ ప్రకటించను న్నారు. సంగీతం: ఏఆర్ రెహమాన్, ఛాయాగ్రహణం: విష్ణు రంగస్వామి.

## నటిగా నాకు బ్రేక్ వస్తుందని ఊహించలేదు: అనుష్క

అనుష్క నటించిన తాజా చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఈ చిత్రంపై అనుష్క చాలా ఆశలు పెట్టుకున్నారు. కొంచెం ఆలస్యం అయినా ఇటీవల తెరపైకి వచ్చిన ఈ చిత్రం తెలుగుతోపాటు తమిళంలోనూ మంచి పేరు తెచ్చుకుంది. ఆమెకిది కమ్ బ్యాక్ చిత్రం అయిందనే చెప్పాలి. ఈ సందర్భంగా నటి అనుష్క మీడియాతో మాట్లాడుతూ 'నటిగా నాకు ఇంత బ్రేక్ వస్తుందని ఊహించలేదు. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి వంటి కొత్త కాన్సెప్ట్ తో కూడిన ఒరిజినల్ కథా చిత్రంలో నటించడం సంతోషంగా ఉంది. ఇకపై వరుసగా కొత్తతరం కథల్లో నటిస్తానని చెప్పుకొచ్చింది.ప్రస్తుతం అనుష్క ఓ మలయాళం చిత్రంలో నటించిన సిద్ధమవుతున్నారు.



## కుమారి శ్రీమతిగా నిత్యమీనన్..!

వచ్చిన పాత్రలు కాకుండా నచ్చిన పాత్రలు చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును అందుకున్న ఈ భామ ప్రస్తుతం ధనుష్ 50వ సినిమాతో పాటు ఓ మలయాళ చిత్రంలోనూ నటిస్తోంది. అలాగే మరో కొత్త కథతో త్వరలోనే ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆమె ప్రధాన పాత్రలో రూపొందుతోన్న వెబ్ సిరీస్ 'కుమారి శ్రీమతి'. శ్రీనివాస్ అవసరాల కథను అందించగా, గోమటేష్ ఉపాధ్యాయు దర్శకత్వం వహించారు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. రీసెంట్‌గా ఈ సిరీస్ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'అబ్దుల్ కలాం అంట.. రజినీకాంత్ అంట.. తర్వాత ఈవిడే నంట.. ఉద్యోగం సద్యోగం చేయదంట.. బిజినెస్సే చేస్తాదంట... కుటుంబాన్ని మొత్తం ఈవిడే లాక్కోస్తుందట. పెళ్లి గిళ్ల వద్దంట వదిన ఇట్టానే ఉండిపోదట' అంటూ నిత్యా మీనన్ క్యారెక్టర్ ను పరిచయం చేయడంతో వెబ్ సిరీస్ పై ఆసక్తి పెరిగింది. ఇందులో 'కుమారి శ్రీమతి' పాత్రలో నిత్యా మీనన్ కనిపించనుంది.

## 'భగవంత్ కేసరి' విడుదల వాయిదా..?



బాలకృష్ణ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'భగవంత్ కేసరి' సినిమా తెరకెక్కుతున్న విషయం అందరికి తెలిసిందే. ఈ సినిమా నుంచి ఇప్పటికే 'గణపతి బప్ప మోరియా' అంటూ గణేష్ పాటను విడుదల చేసి నందమూరి ఫ్యాన్స్ లో ఉత్సాహాన్ని నింపారు. ఓ వైపు ఈ పాట మిలియన్ల వ్యూస్ తో దూసుకు పోతుంటే, మరోవైపు సినిమా రిలీజ్ విషయంలో కన్ఫ్యూజన్ ఉందనే వార్తలు సోషల్ మీడియాలో వస్తున్నాయి. దసరా సందర్భంగా అక్టోబర్ 19న సినిమా విడుదల కానుందని ఇప్పటికే ప్రకటించారు. అయితే ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల కారణంగా అనుకున్న సమయానికి రాకపోవచ్చు అని ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు నాయుడు అరెస్టు కేసు విషయంలో బాలకృష్ణ చాలా బిజీగా ఉన్నారని దీంతో సినిమా పోస్ట్ పోన్ అయ్యే చాన్స్ ఉందంటూ గాసిప్స్ మొదలయ్యాయి. అలాగే దసరా రేసులో రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు', విజయ్ 'లియో' చిత్రాలు కూడా రిలీజ్ అవుతుండటంతో ఈ చిత్రాన్ని కొన్ని రోజులు వాయిదా వేయాలనుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే వీటన్నింటిని కొట్టిపారేస్తూ విడుదల విషయంలో టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఎట్టి పరిస్థితుల్లో 'భగవంత్ కేసరి' అక్టోబర్ 19కే విడుదల అవుతుందని తెలిపారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నాడు.